## అడల్ట్స్ ఓన్లీ కథ

# కోరిక

సిహెచ్. శివరామప్రసాద్

గది తలుపు తెరుచుకుంది.

టి.వి. చూస్తున్న స్వరూపరాణి అటువైపు చూసింది. అతను లోపలకు వచ్చి తలుపులు దగ్గరకు వేశాడు.

ఆమెను చూసి బెరుకుగా నవ్వాడు. రూమ్ అంతా కలయ జూస్తూ నిలబడ్డాడు. తెల్లటి షర్ట్, ప్యాంట్ టక్ చేసుకున్నాడు. గిరజాల జుట్టుతో అందంగా వున్నాడు.

అతన్ని ఎక్కడో చూసినట్లుంది. స్వరూపరాణి జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించింది.

అతని చూపులు ఆమెను తడుముతున్నాయి. కళ్ళల్లో కాంక్ష దోబూచులాడుతోంది. కిళ్ళీ నమిలినట్లున్నాడు. నోరు ఎర్రగా పండింది.

తలుపు దగ్గరే నిలబడి మొహమాటపడుతున్న అతన్ని చూసి నవ్వి ''ఇక్కడకు ఎవరూ రావు. భయపడకండి. రండి'' అన్నది.

''అబ్బే నాకేం భయం లేదు'' అన్నాడు తడబడుతూ.

అతనికి ఇటువంటి వ్యవహారం కొత్తని ఆమెకు తెలుస్తూనే వుంది. అతను లోపలకు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. స్వరూపరాణి వైపు చూస్తున్నాడు. ఆమె కూడా అతని చూపులతో జత కలిపింది.

''నీ పేరేంటి?'' అని ప్రశ్నించాడు.

''నా పేరుతో మీకేం పని?'' తిరిగి ప్రశ్నించింది.

అతను అయోమయంగా చూశాడు.

''ఊరికినే అడిగాను'' అన్నాడు.

''మీరేమైనా రచయితా? కథలు రాస్తారా?''

''అబ్బే! అదేం లేదు'' అన్నాడు.

''అప్పుడప్పుడూ నా దగ్గరకు రచయితలొస్తారు. నీ గురించి చెప్పు? నీ కథేంటి? నువ్వు ఈ వృత్తిలోకి ఎందుకు వచ్చావు? అని అడుగుతుంటారు. మిమ్మల్ని చూస్తే రచయితలేమో అనిపించింది. అందుకే అలా అడిగాను'' అన్నది.

''నిన్ను చూస్తుంటే చదువుకున్న దానిలా వున్నావు. మరి ఇందులోకి ఎందుకొచ్చావు?''


''అదంతా మీరెందుకు తెలుసుకోవడం? మీరు రచయితలు కాదుగా కథ రాయడానికి?'' అని నవ్వింది.

''తెలుసుకున్నందువలన నా కొరిగేదేం లేదు. ఈ రాత్రి గడపాలి గదా! సరదాగా అడిగాను. ఇష్టం లేకపోతే చెప్పనవసరం లేదు''

''మీరు ఈ రాత్రి సరదాగా గడపాలని నాదగ్గరికి వచ్చారు. అందుకు డబ్బు ఇస్తున్నారు. మిమ్మల్ని సంతోషపెట్టాల్సిన బాధ్యత నాకుంది. నా గురించి వింటే మీకు ఆనందం కలుగుతుందంటే, అలాగే చెప్తాను''

''అబ్బే అదేం లేదు. ఇటువంటి వృత్తిలోకి వచ్చేవాళ్ళు గత్యంతరం లేని పరిస్థితుల్లోనే వస్తారు. ఇష్టపడి ఎవరూ రారు. ఆ పరిస్థితులు రకరకాలుగా వుంటాయి'' వాల్‌క్లాక్ మ్యూజిక్ వినిపించి, ఆ తర్వాత తొమ్మిది గంటలు కొట్టింది. స్వరూపరాణి వాల్‌క్లాక్ వైపు చూసింది.

''మీరన్నమాట నిజమే. ఒక్కొక్కరికి ఒక్కో కథ వుంటుంది. నేను టెన్త్‌క్లాస్ చదువుతున్నప్పుడు టీవీ ప్రభావంలో పడ్డాను. గృహిణులంతా సీరియల్స్ మత్తులో పడ్డారు. నేను డ్యాన్స్ కార్యక్రమాల వైపు ఆకర్షింపబడ్డాను. చిన్న చిన్న పిల్లలు కూడా సినిమా పాటలకు అనుగుణంగా డ్యాన్స్‌లు చేస్తుంటే అదొక గొప్ప విషయంగా తోచింది. మా తోటి పిల్లలు కొందరు అప్పటికే టీవీల్లో డ్యాన్సులు వేశారు. వాళ్ళని మిగిలిన పిల్లలు ఆరాధనగా చూస్తుంటే నాకు ఈర్ష్య కలుగుతుండేది. మనం కూడా డ్యాన్స్ ఎందుకు నేర్చుకోకూడదు? అనిపించింది. ఇంట్లో మా అమ్మకు చెప్పాను. మా అమ్మ కోప్పడింది. చదువు మీద శ్రద్ధ చూపించు అన్నది. నేను అలిగి కూర్చున్నాను. మా నాన్న పోనీలే రోజుకొక గంటేగా నేర్చుకో నివ్వు అన్నారు. అలా డ్యాన్స్ నేర్చుకున్నాను. డ్యాన్సు




నేర్చుకునే టైమ్‌లో చదువుమీద శ్రద్ధ తగ్గింది. టెన్త్‌క్లాసులో ఎక్కువ మార్కులు రాలేదు. మనకి డ్యాన్సులు, పాడు వద్దు. ఇంటర్ బాగా చదువు. ఎమ్సెట్‌లో ర్యాంక్ సాధిస్తే ఇంజనీరింగ్ చదవొచ్చు'' అని మా అమ్మ మొత్తుకుంది. టీనేజ్‌లో వున్నప్పుడు మంచి మాటలు తలకెక్కవుగా! అలా మా అమ్మని లక్ష్య పెట్టలేదు. టీవీలో డ్యాన్సులు వెయ్యడానికి సెలక్షన్ కోసం మా వూరికి టీవీ సెలక్షన్ టీమ్ వచ్చింది. ఆడిటోరియమ్‌లో మా వూళ్ళో చాలా టీములు ప్రదర్శనలిచ్చాయి. అందులో నేను సెల్క్టయ్యాను.

ఇక నా సంబరానికి అంతేలేదు. హైదరాబాద్ వెళ్ళి టీవీలో డ్యాన్సు చేస్తున్నాను, నేను టీవీలో కనిపిస్తాను అని కనిపించినవాళ్ళకల్లా చెప్పాను. మా చుట్టాల ఇళ్ళకి వెళ్ళి మరీ చెప్పాను.

## ఛార్మికి నచ్చిన కారు

గ్లామరస్ స్టార్ ఛార్మి 'మంత్ర' సినిమాతో మరింత క్రేజ్‌ని తెచ్చుకుంది. దీంతో తన పారితోషికాన్ని కూడా అమాంతం పెంచేసిందిట. పారితోషికాన్ని పెంచేయడమే కాదు, ఖర్చుల విషయంలో చాలా పొదుపుగా కూడా వుంటూ వచ్చిందిట. ఎందుకో తెలుసా? తనకి ఎంతో ఇష్టమైన 'బియండబ్ల్యూ- 5 సీరీస్' కారుని కొనుక్కోవాలనిట. నిన్నటి మే 17న తన బర్త్‌డేని జరుపుకున్న ఛార్మి ఎంతో కాలంగా ముచ్చటపడుతున్న 'బిఎండబ్ల్యూ' కారుని తనకి తానే గిఫ్టుగా కొనుక్కుని తన చిరకాల వాంఛని తీర్చుకుందిట.



మా డ్యాన్సు మాష్టారుతో కలిసి హైదరాబాద్ వెళ్ళాను. అక్కడ స్టూడియోలో నా డ్యాన్సు కార్యక్రమం షూట్ చేశారు. అప్పుడు శంకర్ అనే మేకప్ మేన్ నాకు పరిచయమయ్యాడు.

''నీ డ్యాన్స్ సూపర్'' అన్నాడు.

''థాంక్స్'' అన్నాను.

''నీలో ఛార్మ్ వుంది. నువ్వు హీరోయిన్‌గా పనికొస్తావు'' అన్నాడు.

అతనా మాట చెప్పగానే నాకు ఆశ పుట్టింది.

''హీరోయిన్ ఛాన్స్ ఎవరిస్తారు?'' అన్నాను.

''ముందు నటన నేర్చుకుంటే ఎవరైనా ఇస్తారు'' అన్నాడు.

''నటన ఎక్కడ నేర్పుతారు?'' అని అడిగాను.

''ఇక్కడ చాలా ఇన్‌స్టిట్యూట్స్ వున్నాయి'' అన్నాడు.

శంకర్ చెప్పిన మాటలు నాలో ఆలోచనలు రేకెత్తించాయి. టీవీలో డ్యాన్స్ చేస్తే ఏం గొప్ప? సినిమా హీరోయిన్ ఐతే ఎంత పేరు, ప్రతిష్ట. లక్షలు సంపాదించొచ్చు. హైదరాబాద్‌లో వుండొచ్చు. కార్లు, మేడలు కొనుక్కోవచ్చు. నా కోరికలు గుర్రాలైనాయి.

ఇంటికొచ్చి మా అమ్మకు చెప్పాను. మామూలుగానే మా అమ్మ తిట్టిపోసింది.

''సరదా పడుతున్నావని డ్యాన్స్ నేర్పిస్తే, ఏకంగా చదువు మానేసి యాక్టింగ్ స్కూల్లో చేరతావా? పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే కాళ్ళు విరగ్గొడతాను'' అన్నది.

మామూలుగానే నేను అలిగి నిరాహార దీక్ష చేశాను. మా నాన్న మెత్తబడ్డాడు.

''పోనీలేవే! బలవంతం చేస్తే మాత్రం అది చదువుతుందా? ఆ యాక్టింగ్ స్కూల్లో చేరనీ. ఏం బోయిందీ?'' అన్నాడు.

''మీకు తెలియదు వూరుకోండి. సినిమా హీరోయిన్ అంటే అంత తేలిగ్గా అవరు. యాక్టింగ్ స్కూల్లో చేరినంత మాత్రాన హీరోయినవుతుందా? చిన్నపిల్ల. దానికేం తెలుసు? మీరు దానికి వంతపాడకండి'' అని మా అమ్మ కేకలు పెట్టింది.

''నేను ఇక చదవను. కాలేజీకి వెళ్ళను'' అని భీష్మించుకున్నాను.

''చదవకపోతే మూల కూర్చో. పెళ్ళి చేసి పంపిస్తే పీడా పోతుంది'' అన్నది అమ్మ.

నేను ఏడుస్తూ కూర్చున్నాను. నా కోరిక తీరనందుకు చాలా బాధ కలిగింది. నా మాట కాదన్నందుకు మా అమ్మ మీద కోపం వచ్చింది. ఎట్లాగైనా హీరోయిన్ కావాలనే కోరిక తీవ్రమైంది.

సినిమా పత్రికలు తిరగేస్తూ అందులో హీరోయిన్స్ స్టిల్స్ చూస్తూ నన్ను నేను అందులో ఊహించుకుంటూ వుండేదానిని.

ఒకరోజు డ్యాన్స్ మాష్టారు కనిపించి ''హైదరాబాద్ నుంచి శంకర్ వచ్చాడు. మేకప్ మేన్. హీరోయిన్ ఛాన్సుందటు. ట్రై చేస్తావా?'' అని అడిగాడు.

''మా ఇంట్లోవాళ్ళు ఒప్పుకోవడం లేదండీ'' అన్నాను.

''మీ ఇంట్లోనే కాదు ఎవరింట్లోనూ ఒప్పుకోరు. వాళ్ళ భయం వాళ్ళది. ఎవరి దారి వాళ్ళు వెతుక్కోవాలి. నువ్వు హీరోయిన్ కావాలంటే శంకర్ వెంట వెళ్ళు. లేకపోతే లేదు'' అన్నాడు.

నాకు తలుపు తట్టిన అదృష్టం చెయ్యి జారినట్లు అనిపించసాగింది. ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోతే అనే ఆలోచన వచ్చింది. ముందు బాధపడినా నేను హీరోయిన్నై పేరు తెచ్చుకుని డబ్బు సంపాదిస్తుంటే వాళ్ళే నా దగ్గరకు వస్తారు అనుకున్నాను.

ఆ సాయంకాలం డ్యాన్స్ స్కూల్లో శంకర్‌ని కలుసుకున్నాను. అతను నాకు చాలా మాయ మాటలు చెప్పాడు. ఆ రాత్రి నైట్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వచ్చేశాను శంకర్ వెంట.

అతను నన్ను రూమ్‌కి తీసుకెళ్ళాడు. అది చూసి నాకు నీరసం ముంచుకొచ్చింది. నా వుద్దేశ్యం కని పెట్టి శంకర్ నవ్వాడు.

''ముందు ఎవరైనా ఇటువంటి చోటే వుంటారు. ఇక్కడ వుండే అదృష్టం వెతుక్కోవాలి'' అన్నాడు.

నాకు మేకప్ వేసి స్టిల్స్ తీయించి ఆల్బమ్ తయారుచేయించాడు. అది తీసుకెళ్తూ వుండేవాడు. పెద్ద పెద్ద డైరెక్టర్ల పేర్లు చెప్తుండేవాడు. వాళ్ళని కలిశాను, వీళ్ళని కలిశాను అని చెప్తుండేవాడు. అతని మాటల్ని అమాయకంగా నమ్మేదాన్ని. అతనితో ఒంటరిగా వుంటున్నాను కాబట్టి ఒక బలహీనమైన క్షణంలో అతనికి లొంగిపోయాను.

తర్వాత నన్ను స్టూడియోలా చుట్టూ తిప్పాడు. డైరెక్టర్లకు పరిచయం చేశాడు. ఒక డైరెక్టర్ నీకు ఛాన్స్ ఇస్తానన్నాడు. మరి అతనితో ఒక రాత్రి గడపాలి. తప్పదు. అందరూ అంతే..'' అన్నాడు.

అలా ఒక హోటల్ రూమ్‌లో ఆ డైరెక్టర్ కామదాహం తీర్చాను. ఐతే అతను నాకిచ్చింది హీరోయిన్ వేషం కాదు, హీరోయిన్ ఫ్రెండ్స్‌లో ఒక కేరెక్టర్. అసలు లేనిదానికంటే ఏదోకటి అనుకుని అటువంటి వేషాలకే అలవాటుపడ్డాను.

మా అమ్మా, నాన్న నా ఆచూకీ కనుక్కుని వచ్చి ఇంటికి వచ్చెయ్యమని బతిమాలారు. నేను రానని చెప్పేశాను. ఈ జీవితానికి అలవాటు పడ్డాను. నేను ఎవర్ని పెళ్ళి చేసుకున్నా అతనితో నిజాయితీగా కాపురం చెయ్యలేను. నా గతం తెలిసి ఎవరూ పెళ్ళి చేసుకోరు. అందుకే ఇక్కడ సెటిలైపోయాను. చిన్న చిన్న వేషాలు వేస్తూ, అవి లేనప్పుడు ఇలా సైడ్ బిజినెస్‌గా వ్యభిచారం చేస్తూ గడుపుతున్నాను.''

చెప్పడం ముగించింది స్వరూపరాణి.

అతను నిట్టూర్చాడు.

''పోనీ ఆ శంకర్ని పెళ్ళి చేసుకోవచ్చుగా?'' అడిగాడు.

''మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చింది ఆ శంకరే. వాడే నాకు బ్రోకర్'' అని పక పకా నవ్వింది ఆమె.

అతను షాక్ తిన్నట్లయ్యాడు.


''ఏమిటలా అయ్యారు. ఈ సిటీలో స్టార్ హోటల్ గదుల్లో నాలాంటివాళ్ళు ఎందరో? దీపం చుట్టూ తిరిగి ప్రాణాలు కోల్పోయే పురుగుల్లాంటి వాళ్ళుంటారు. పైకి టిప్ టాప్‌గా, నాజూకుగా ఖరీదైన బట్టల్లో, గిల్ట్ నగలు పెట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ ఆకర్షణీయంగా కనిపిస్తారు. వాళ్ళ చీకటి బతుకులు రోజుకో మగాడితో తెల్లవారు తుంటాయి'' అన్నది.

అతను తల వూపాడు.

ఆమెకు అతను ఎవరో గుర్తొచ్చింది. తలలో ఫ్లాష్ వెలిగింది. టెన్త్‌క్లాస్ చదువుతున్నప్పుడు లెక్కల మాష్టారు మధుసూదనరావుగారి అమ్మాయి పెళ్ళిలో చూసింది. ఇతనే వరుడు.

''అయ్యో! మాష్టారి అల్లుడు ఇలా తయారయ్యాడేమిటి?'' అనుకుంది మనసులో.

అతను నెమ్మదిగా ఆమె పక్కకు చేరాడు. పమిట జార్చి ఆమె అందాలు తదేకంగా చూస్తున్నాడు. అతని నోటినుంచి విస్కీ వాసన వస్తోంది.




ఆమె మృదువుగా అతని చెంపలను నిమిరింది. అతను తమకంతో ఆమెను కౌగలించుకున్నాడు.

''ఏమండీ మీరు నా గురించి తెలుసుకున్నారు. నేను మీ గురించి తెలుసుకోవచ్చా?'' అని అడిగింది స్వరూపరాణి.

''నా గురించి ఏముంది తెలుసుకోవడానికి. మామూలుగా చదువుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను. నాకేం స్టోరీ వుంటుంది?'' అన్నాడు నవ్వుతూ.



''అది కాదు. మీకు పెళ్ళయింది కదా?''

''ఔను''

''మరి ఇలా కాల్‌గరల్స్‌తో ఎందుకు గడపాల్సి వచ్చింది?'' అడిగింది స్వరూపరాణి.

''అదా! నా భార్య పుట్టింటికి వెళ్ళింది. నెల రోజులుంటుంది. ఈలోపల నేను కోరికకు తట్టుకోలేక ఇలా వచ్చాను'' అన్నాడు.

''మీరు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా? పెద్దలు కుదిర్చిన పెళ్ళా?''

''ప్రేమించే సుస్మితను పెళ్ళి చేసుకున్నాను''

''మరి ఇలా పరాయి ఆడదానితో గడపడం మీ సుస్మితకు ద్రోహం చెయ్యడం కాదా?''

''మరి నా కోరిక తీరే మార్గం కనిపించక, సరదాగా వచ్చాను''

## తిప్పలు తప్పవు

**మలైకా అరోరా చెల్లెలు అమృతా అరోరా ఏడెనిమిదేళ్లుగా బాలీవుడ్‌లో వున్నా ఇంకా తనదైన గుర్తింపు తెచ్చుకోలేదు. కానీ మలైకా మాత్రం తనదైన క్రేజ్ సొంతం చేసుకుంది, పెళ్లి చేసుకున్నా కూడా. ఎలాగైనా క్రేజీ స్టార్ కావాలని ఉవ్విళ్లూరుతున్న అమృతా అరోరా తాజాగా ఓ ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్ పేజీ మీద హాట్ హాట్‌గా దర్శనమిచ్చింది. ఈ స్టిల్ గురించి నలుగురూ చర్చించుకుంటున్నారు. కానీ వేషాలు వస్తాయా అని?**

''మీలాగే మీ సుస్మిత కూడా కోరిక కలిగి అక్కడ ఎవరితోనైనా గడిపితే?''

స్వరూపరాణి అడిగిన ప్రశ్న బులెట్‌లా తగిలింది. బిత్తరపోయాడు. తలంతా దిమ్మెక్కిపోయింది.

''సుస్మిత కూడా వయసులో వుంది. ఆమెకూ కోరిక వుంటుంది గదా?'' రెట్టించింది స్వరూపరాణి.

అతను ఆమెను వదిలి నిల్చున్నాడు. లేచి వెళ్ళబోతుంటే ''సారీ అండీ! మిమ్మల్ని లేనిపోని ప్రశ్నలు అడిగాను కదా?'' అన్నది.

''కాదు సరిగ్గానే అడిగావు'' అని చరాచరా తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు అతను.

☆